ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?

మెహిదీపట్నం : గుడిమల్కాపూర్‌లో కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

● బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం

అంబర్‌పేట, డిసెంబర్ 6 : బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసన తెలియజేయడానికి వెళ్తున్న అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, నాయకులను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. నల్లకుంటలోని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట సీఈ కాలనీలో తన ఇంటి వద్ద డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లవంగు ఆంజనేయులు తదితరులను అంబర్‌పేట పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మెహిదీపట్నం : బీఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిల అరెస్ట్‌లకు నిరసనగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసనలకు దిగకుండా పోలీసులు అక్రమఅరెస్ట్‌లు,నిర్బంధాలను చేపట్టారు. శుక్రవారం కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులను తెల్లవారుజాము నుంచే పోలీసులు నిర్బంధించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్, ఠాకూర్ జీవన్‌సింగ్‌ల ఇండ్ల వద్దకు పోలీసులు చేరుకుని భయభ్రాంతులకు గురి చేశారు.

కార్వాన్ : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని కార్వాన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్‌జీవన్‌సింగ్ అన్నారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులు హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి ఇతర నాయకుల అరెస్టును నిరసిస్తూ కార్వాన్ నియోజకవర్గంలో జీవన్‌సింగ్, శ్రీధర్‌సాగర్ అధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులు కోడూరు శ్రీధర్ సాగర్, ముత్యాల భాస్కర్, ఆదిత్యయాదవ్. వాసుగౌడ్, బంటి యాదవ్, పట్లూరి రఘు, వనం హరి, శేఖర్, కనకరాజు, సంజనలను నిర్బంధించారు.

చార్మినార్ : రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ పైశాచిక ఆనందం పొందుతుందని బహదూర్‌పుర బీఆర్ఎస్ నాయకుడు చిగుళ్ల సాయి కిరణ్ అన్నారు. ప్రభుత్వంపై నిరసన తెలియజేయడానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యానిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ నెక్లెస్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారని అన్నారు.

రెడ్‌హిల్స్‌లో నాంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌ను గృహనిర్బంధం చేస్తున్న పోలీసులు

బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు. – కార్వాన్

అంబర్‌పేట: నల్లకుంటలో గోల్నాక కార్పొరేటర్ లావణ్యగౌడ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

సీసీ కాలనీలో కార్పొరేటర్ బి.పద్మారెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు – అంబర్‌పేట

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవి రాజశేఖ ర్,వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి ఉపేందర్‌రెడ్డి,అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రేణుక. – సుల్తాన్‌బజార్

నాయకుడు సాయి కృష్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అంబర్‌పేట పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ ఈ విజయ్‌కుమార్‌గౌడ్, ఇతర బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

మైనర్లు వాహనాలు నడపటం నేరం

మైనర్లు వాహనాలు నడపటం చట్ట రీత్యా నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బాపునగర్ ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అంబర్‌పేట ట్రాఫిక్ సీఐ లెనిన్ బాబు, ఎస్సై వీరమల్లయ్య, టీటీసీ అధికారులు కృష్ణ, ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు. – గోల్నాక

బొడ్రాయికి పూజలు

అంబర్‌పేట దేవస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల నెలకొల్పిన బొడ్రాయి(నాభిశిల)కు శుక్రవారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన సేవా సమితి చీఫ్ అడ్వయిజర్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, కార్యనిర్వహన కార్యదర్శి దొమకొండ కిశోర్, బొడ్రాయి పునఃనిర్మాణ కమిటీ కన్వీనర్ సి.శ్రీనివాస్‌ముదిరాజ్ డీసీని సన్మానించారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 6

బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకునే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు కోళ్ల ప్రదీప్‌రాజ్ శుక్రవారం కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ కొంత మంది బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి పార్టీలోకి వచ్చేందుకు చూస్తున్నారని వివరించారు.

– అబిడ్స్, డిసెంబర్ 6

కోర్టు ఉత్తర్వుల కాపీలు పోలీస్ ఉన్నతాధికారులకు అందజేత

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 6: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వుల కాపీలను సంభంధిత అధికారులకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌లు అందజేశారు. ఈ మేరకు ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ ఏ బాలస్వామి, సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ శంకర్, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నివాసాచారిలకు హై కోర్టు అందజేసిన ఉత్తర్వుల కాపీలను అందజేసి వారితో చర్చించారు. అధికారులు, పోలీసులు ప్రభుత్వ వైద్యులతో సోదర భావంతో సామరస్య పూర్వక వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రాముఖ్యతను కనబరుస్తాయని వారు వివరించారు. డీఎం హెచ్ఎస్ క్యాంపస్, తెలంగాణ వైద్య భవన్ ఈస్ట్‌జోన్ డీసీపీ, సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చెందిన కారణంగా పై అధికారులకు హై కోర్టు ఉత్తర్వుల కాపీలను అందజేయడం జరిగిందని వారు వివరించారు. తెలం గాణ ప్రభుత్వ వైద్యుల సంఘానికి నూతనంగా ఎన్నికైన డాక్టర్ నరహరిని, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌లను ప్రత్యేకంగా అభినం దించారు.

డీసీపీ బాలస్వామికి హై కోర్టు ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరహరి

సేవా భారతి పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, డిసెంబర్ 6 : హెవెన్ హోమ్స్ సొసైటీ పౌండేషన్ సేవారంగంలో 20 ఏండ్లు పూర్తైన సందర్భంగా ప్రతి ఏటా అందించే సేవ భారత్ అవార్డ్స్ 2024 కార్యక్రమం శుక్రవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ సీబీఐ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, హెవెన్ హోమ్స్ సొసైటీ అధ్యక్షురాలు వరలక్ష్మి అడపాలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురికీ సేవా భారత్ అవార్డులను బహూకరించి 'సక్సెస్‌ఫుల్ జర్నీ ఆఫ్ వరలక్ష్మి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షురాలు వరలక్ష్మి అడపాలు, రిటైర్డ్ జడ్జి నేర్లళ్ల మల్యాద్రి పాల్గొన్నారు.

శివ మార్కండేయ ఆలయ వార్షికోత్సవాలు

శివ మార్కండేయ దేవాలయ 14వ వార్షికోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహించారు. అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. బాల మార్తాండ మాణిక్ ప్రభు సోమయాజులు అధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో శివ మార్కండేయ దేవాలయం అధ్యక్షుడు అట్టిపాముల నర్సింగ్‌రావు, కార్వాన్ పద్మశాలి సంఘం ప్రతినిధులు క్రిష్ణ, అంబటి శ్రీనివాస్, కట్లా అశోక్, గంజి రఘునాథ్, నామా యాదగిరి, అంబటి సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. – కార్వాన్, డిసెంబర్ 6

వైభవంగా రాధా నృత్యనిలయ శివశక్తి సమ్మేళనం

పార్వతి కల్యాణం నృత్యరూపకాన్ని పదర్శిస్తున్న కళాకారిణులు

రవీంద్రభారతి, డిసెంబర్ 6 : ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాధా నృత్యనిలయం ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో రాధా నృత్యనిలయం 22వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇమ్మడి రాధామోహన్ శిష్యులు వందమందితో పార్వతి కల్యాణం భారత నాట్య నృత్యరూపకాన్ని శ్రీ సత్యసాయిబాబా చరణాలవిందానికి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీణా విద్వాన్ సీతారామయ్య, వేదాంతం రాధేశ్యామ్, వెంపటి శ్రీవల్లిశరర్మ, మంజుల శ్రీనివాస్, నీరజ ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి శ్రీ సత్యసాయిబాబా వారిని వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారికి సంస్థ అధ్యక్షురాలు ఇమ్మడి రాధామోహన్ విద్యార్థులచే భరత నాట్య శైలిలో పార్వతీ కల్యాణంను నృత్యరూపకం, గీతాలతో ఆలపించారు.

ఆజాద్‌నగర్, ప్రేంనగర్‌లలో కుక్కల బెడదను అరికట్టండి

అంబర్‌పేట, డిసెంబర్ 6 : అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్, ప్రేంనగర్ బస్తీలలో తీవ్రమైన కుక్కల బెడదని వెంటనే అరికట్టాలని ఆ బస్తీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఇటీవల ప్రేంనగర్‌లో ఓ యువకుడిని కుక్కలు వెంబడించి కరవడంతో బస్తీవాసులు అలీ కేప్ చౌరస్తాలోని కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రం దగ్గరకు వెళ్లి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె.పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.లింగారావు, ప్రధాన కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షుడు మనోజ్‌యాదవ్, ప్రతినిధులు తదితరులు నార్త్‌జోన్ డైరెక్టర్ చక్రపాణి దృష్టికి విషయాన్ని తీసుకురాగా, సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేస్తానని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కుక్కల బెడదను అరికట్టాలని ఆందోళన చేస్తున్న ఆజాద్‌నగర్, ప్రేంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎస్సీ రిజర్వేషన్లను పెంచాలి

ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు జి. చెన్నయ్య, మాల నాయకులు చెరుకు రాం చందర్, బూరుగుల వెంకటేశ్వర్లు, గోపోజి రమేశ్‌లతో కలిసి నివాళులర్పించారు. – సుల్తాన్‌బజార్



నాంపల్లి పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సి. సంజయ్ తదితరులు

అంబేద్కర్‌కు ఘన నివాళి

చార్మినార్, డిసెంబర్ 6 : చార్మినార్ నియోజకవర్గంలోని మొఘల్‌పుర డివిజన్ అధ్యక్షుడు పుప్పాల రాధకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను అణిచివేస్తూ దిక్కారధోరణి ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. మొఘల్‌పుర డివిజన్ అధ్యక్షుడు రాధాకృష్ణ ఉన్నారు.

అంబర్‌పేట : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి బాగ్‌అంబర్‌పేట డివిజన్ అంబేద్కర్‌నగర్ వాసులు కుంకుమ నరేందర్, కోటం అనిల్‌కుమార్, కుంకుమ రాజేశ్వర్‌రావు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాచిగూడ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కుద్బిగూడలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు బబ్లూసింగ్, అంటోని ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సునీల్‌బిడ్లాన్, దర్శన్, విశాల్, సందీప్, ఆకాశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

అంబేద్కర్ వర్ధంతి వేడుకలలో వాటర్‌వర్క్స్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.నర్సింగ్‌రావు తదితరులు – అబిడ్స్

కట్టేల మండి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజాసింగ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శివసేన నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బబ్లూసింగ్, అంటోని తదితరులు

కృష్ణనగర్‌లో సీపీఎం నాయకులు



మెహిదీపట్నం : లక్ష్మీనగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ తదితరులు



మెహిదీపట్నం: ఇబ్రహీంబాగ్‌లో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజువస్తాద్

వృద్ధుడు మృతి

కాచిగూడ,డిసెంబర్ 6: కాచిగూడ రైల్వేస్టేషన్ ఫిట్‌లైన్‌లో వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మక్సూద్ కథనం ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65)శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ ఫిట్‌లైన్ ప్లాట్‌ఫాం-1లో అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీషర్ట్, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9912221985లో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత నిందితురాలు అరెస్టు, రిమాండ్

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 6 : బలంవంతంగా డబ్బులు ఫోన్లలను లాక్కొంటున్న పాత నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శుక్రవారం సుల్తాన్ బజార్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. రాజ్‌భవన్‌రోడ్ ఎంఎస్ మక్తాకు చెందిన ముస్కాన్ దబేలా అస్మా ఉన్నీసా(45), సెక్స్ వర్కర్. భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడం, ఒప్పుకోక పోతే కత్తితో బెదిరించి ఫోన్లను, డబ్బులను లాక్కొని భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఇదిలా ఉండగా నవంబర్ 16 వ తేదీన ఫలక్‌నుమా, మదీనా కాలనీకి చెందిన గులాం ముస్తఫా(25) రంగ్‌మహల్ మీదుగా వెళ్తుండగా ముస్కాన్ ఉద్దేశ్యపూర్వకంగా లిఫ్ట్ అడిగింది. వాహనాన్ని ఎక్కిన అనంతరం డబ్బు అడగడం మొదలు పెట్టింది. అతడు తిరస్కరించడంతో అసభ్యకరంగా దుర్భాషలాడుతూ ముఖంపై, వీపుపై కొట్టింది. దీంతో ముస్తఫా భయపడి వెయ్యిరూపాయల నగదు ముస్కాన్‌కు ఇచ్చాడు. అంతటితో ఆగకుండా ముస్కాన్ అతడి జేబులో నుంచి బలవంతంగా ఫోన్‌లాక్కొని పరారైంది దీంతో ముస్తఫా సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టి నిందితురాలు ముస్కాన్‌ను అరెస్టు చేసి ఫోన్‌తో పాటు బ్లేడును స్వాధీనం చేసుకొని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

నిందితురాలు స్కాన్‌దబేలా అస్మా ఉన్నీసా